క్లుప్తంగా

'సత్యసాయి' ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటరమణ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు మరిడి మాంబ ఆలయ సమీపంలో సిగ్నల్ పాయింట్ వద్ద సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జనని సోషల్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు విందుల వెంకటరమణ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి జ్యోతి ప్రజ్వలన చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి సేవా సమితి 21 సంవత్సరాలుగా అగనంపూడిలో ప్రతీ ఏటా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న క్రమంలో శాశ్వత షెల్టర్‌ను నిర్మించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, అగనంపూడి మండలి కో–కన్వీనర్ విందుల వరహాలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



నడుపూరు రామాలయంలో పట్టాభిషిక్తుడైన శ్రీరాముడు

పెదగంట్యాడ: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా 76వ వార్డు నడుపూరు రామాలయంలో, 75వ వార్డు నెల్లిముక్కు రామాలయంలో శ్రీ రామ పట్టాభిషేకాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. రామాలయ కమిటీ సభ్యులు దూడ సింహాచలం ఆధ్వర్యంలో పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

గాజువాక : జీవీఎంసీ గాజువాక జోన్‌లో మరో 11 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తమను విధుల నుంచి తొలగించడానికి టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన కుట్రతో మనస్తాపం చెందిన వలంటీర్లు వార్డుల వారీగా తమ రాజీనామాలను సమర్పిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా 85వ వార్డుకు చెందిన ఎస్.నూకరత్నం, డి.జ్యోత్స్న, ఎస్.జానకి, బి.దేవుడమ్మ, ఆర్.రమాదేవి, ఎస్.రాము, టి.ఉషారాణి, పి.గంగాభవాని, జి.రమా, ఆర్.వరలక్ష్మి, ఎం.మంజుభార్గవి తమ విధులకు రాజీనామా చేసినట్టు గాజువాక జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి గురువారం శ్రీకాకుళం జిల్లా మందసకు చెందిన ఆర్.తిరుపతిరావు అనేదాత లక్ష 116 రూపాయల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్‌ను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు. సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

మీ ఆశీస్సులే శుభ సంకేతం

- ఆదరాభిమానాలే శ్రీరామరక్ష
- రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 68వ వార్డు ప్రచారంలో అడుగడుగునా నీరాజనాలు



వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న అమర్‌నాథ్



అక్కిరెడ్డిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: 'గుడివాడ' కుటుంబ సభ్యుడిగా అడుగడుగునా మీరు చూపిస్తున్న ఆదరాభిమానాలే నాకు శ్రీరామరక్ష. మీ ఆశీస్సులే కొండంత అండ. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు పొందినవారంతా ఎంతో కృతజ్ఞతతో స్వాగతిస్తున్నారు. అభివృద్ధిని నేరుగా చూస్తున్న వారు అండగా నిలుస్తున్నారు. మా విజయానికి ఇది శుభసంకేతం' అన్నారు రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్. జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో గురువారం సాయంత్రం అమర్‌నాథ్ ప్రచారం నిర్వహించారు. ఆయనకు మహిళలు అడుగడుగునా హారతులిచ్చి స్వాగతం పలికారు. విజయతిలకం దిద్ది ఆశీర్వచనాలు అందించారు. వృద్ధులు ఆప్యాయంగా పలకరిస్తూ మద్దతు తెలిపారు. ముందుగా అమర్‌నాథ్ అక్కిరెడ్డిపాలెం గ్రామ దేవతలు కుంచమాంబ, దుర్గమాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని నూకాంబిక అమ్మవారిని, మింది గ్రామదేవత మల్లమ్మ పేరంటాళ్లమ్మ వారిని దర్శించుకున్నారు.

అడుగు కలిపిన మహిళలు

వందలాది మంది మహిళలు పాదయాత్రలో అమర్‌తో అడుగులు కలిపారు. గ్రామంలో రోడ్లన్నీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో నిండిపోయాయి. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ కరపత్రాలను అందజేసి ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరారు. పాదయాత్రలో అమర్‌నాథ్ పలు చోట్ల వృద్ధులకు ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారు గుడివాడ కుటుంబంతో తమ అనుబంధాన్ని అమర్‌తో పంచుకున్నారు. వారి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని దీవించారు. వివేకానంద కాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వ్యాపారులకు, లాండ్రీ నిర్వాహకులకు పార్టీ కరపత్రాలను అందజేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు.

కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, గాజువాక ఎన్నికల అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, నాయకులు జీలకర్ర నాగేంద్ర, వరదాడ వెంకటరమణ, సంగ్రాన నూకరాజు, మొల్లి చిన్న, నేలపాటి సత్యవతి, గొంతిన శ్రీనివాసరావు, సోమిరెడ్డి అరుణ, ఎం.సత్యవతి, ఈటి సురేష్, రెడ్డిపల్లి చిట్టిబాబు, శాంతి కుమారి, తిరుపతి ప్రసాద్, సయ్యద్ హుస్సేన్ బ్రదర్స్, శ్రీనివాస రెడ్డి, తెంటు గోపాలరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.వెంకటరావు, కోడా రాజారావు, సీహెచ్ సతీష్, శీరం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



కిరాణా షాపు యజమానురాలికి కరపత్రం అందజేస్తున్న అమర్‌నాథ్



అమర్‌నాథ్‌కు హారతి ఇస్తున్న మహిళలు

అమర్‌నాథ్ అందరికీ అండగా ఉంటారు



సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌నాథ్ భార్య హిమగౌరి

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్‌ను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటూ ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తారని ఆయన భార్య హిమగౌరి అన్నారు. అభివృద్ధిలో గాజువాకను మోడల్ సిటీగా తీర్చిదిద్దుతారన్నారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కణితి విశ్వబ్రాహ్మణ వీధి సామాజిక భవనంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల హామీలను శతశాతం నెరవేర్చిన సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. అటువంటి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అమర్‌నాథ్ ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారని, అటువంటి వ్యక్తి గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విషయాన్ని గడప గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. పార్టీ కోసం కష్టపడే ప్రతీ ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తారన్నారు. గాజువాక ఎమ్మెల్యేగా అమర్‌నాథ్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజారిటీతో గెలిపించే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కొమ్మోజు శేషు, సామోజు నాగేశ్వరరావు, కోమటి రమాదేవి, శృంగవరపు బ్రహ్మాజీ, మార్పు శేషు, శీరం పాపారావు, వడ్లపూడి ఈశ్వరరావు, పాలిశెట్టి సత్యనారాయణ, బొడ్డేటి మెదీనాయుడు, చిత్రాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపిద్దాం



75వ వార్డు కండిపిల్లి వీధిలో ప్రచారం చేస్తున్న కొయ్య భారతి తదితరులు

పెదగంట్యాడ: గాజువాక నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్‌ను, విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలకు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ కొయ్య భారతి కోరారు. 75వ వార్డు కండిపిల్లి వీధిలో గురువారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

తొలిరోజు రెండు నామినేషన్లు

గాజువాక : సార్వత్రిక ఎన్నికలకు గాజువాకలో నామినేషన్లు ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇద్దరు అభ్యర్థుల నుంచి గాజువాక రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి నామినేషన్లను స్వీకరించారు. తొలి నామినేషన్‌ను జాతీయ జనసేన పార్టీ తరఫున పల్లి శ్రీనివాసరావు సమర్పించారు. తన మద్దతుదార్లతో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చిన ఆయన ఉదయం 11.30 గంటల సమయంలో ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అనంతరం పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పెబ్బిలి సత్యనారాయణ మూర్తి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఆయన నామినేషన్‌ను సమర్పించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి



వ్యాపారికి కరపత్రం అందిస్తున్న అమర్‌నాథ్ తల్లి గుడివాడ నాగమణి

కూర్మన్నపాలెం: ప్రజా సంక్షేమమే పరమావధిగా ఎన్నో పథకాలను అమలు చేసి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తల్లి నాగమణి అన్నారు. ఆ పథకాలు కొనసాగేందుకు వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 86వ వార్డు ఫకీర్‌తకియాలో వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, విశాఖ జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. భవిష్యత్తులో మరిన్ని పథకాలను అమలు చేయనున్నారని చెప్పారు. గుడివాడ అమర్‌నాథ్ కూడా తాతయ్య, తండ్రిలా సేవా భావం గలవారని, అమర్‌ను గెలిపిస్తే గాజువాకను మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, నాయకులు చేగొండి శ్రీనివాస్, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్ పట్నాయక్, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మలమ్మ, భూపతిరాజు శ్రీనివాసరాజు, అల్లావుద్దీన్, లారా, మున్నా, నజీర్, కన్వీనర్లు బాలకృష్ణ, వరలక్ష్మి, దేవా, పెంటారావు, సాయి, సరోజిని, ఇందిర, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో చలివేంద్రం ప్రారంభం



కార్మికులకు మజ్జిగ అందజేస్తున్న పారిశ్రామిక వేత్తలు

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. గురువారం ఆటోనగర్ డీ బ్లాక్ పాత ఆర్టీవో కార్యాలయం రోడ్డులో ఏపీఐఐసీ ఐలా ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ ఆధ్వర్యంలో వాసీవా, ఏపీఐఐసీ ఐలా, పోవా సంయుక్తంగా దీనిని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ఐలా మాజీ చైర్మన్ శేషగిరిరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 30 రోజుల పాటు మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, పారిశ్రామిక వేత్తలు పి.రామకృష్ణ, నూకరాజు, గుర్రం శ్రీను, లక్ష్మీపతి, ఎంఎస్ఎంఈ ఏడీలు ప్రభాకర్ కుమార్, బేగ్, పి.వినోద్‌కుమార్, సతీష్, ఐలా సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



కుట్టుమెషీన్ల పంపిణీ ప్రారంభిస్తున్న బిషప్ మహంతి

గాజువాక : స్థానిక సీఎల్‌సీ మినిస్ట్రీస్ చైర్మన్ బిషప్ మహంతి ఆధ్వర్యంలో పేద మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. మినిస్ట్రీస్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మహంతి మాట్లాడుతూ పేద మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. తమ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు ఆల్‌ఫ్రెడ్ మహంతి, మెర్సీ మహంతి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం దిగొచ్చేవరకు పోరాటం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకునేందుకు కార్మికుల దృఢ సంకల్పంతో ఉన్నారని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా, కార్మికుల ఉద్యమాల ముందు తలవంచక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద 1162వ రోజు, గురువారం దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధ్వంసకర ప్రయత్నాలకు అండగా ఉంటూ వాటిని అమలు జరిపే ఉక్కు అధికారులకు త్వరలోనే తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని, విశాఖ ఉక్కు జోలికి వస్తే కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితులు, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. విశాఖ ఉక్కును కొనడానికి ఎవరు ముందుకు వచ్చినా అడ్డుకుంటామన్నారు. పోరాటాలు, ప్రాణ త్యాగాల ద్వారా ఏర్పడిన సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



అగనంపూడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న రామనారాయణ

కూర్మన్నపాలెం: ఎన్నికల నేపథ్యంలో అగనంపూడి టోల్‌గేట్ సమీపంలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. అందులో భాగంగా గురువారం స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ లీడర్ రామనారాయణ, హెడ్ కానిస్టేబుల్ అప్పారావు వాహన తనిఖీలను చేపట్టారు. రామనారాయణ మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నామన్నారు. ఏ వాహనంలోనైనా 50 వేలకు పైబడి నగదు ఉన్నట్లు గుర్తిస్తే దానికి సంబంధించి సరైన ఆధారాలను చూపించాలని, లేకుంటే ఆ నగదును సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నామని చెప్పారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా బొర్రమాంబ పుట్టబంగారు మహోత్సవం



పుట్ట బంగారు మహోత్సవం సందర్భంగా వనం వద్ద మహిళల కోలాహలం



అమ్మవారి ఊరేగింపు కోసం నీళ్ల బిందెలతో వేచి ఉన్న మహిళలు



బొర్రమాంబ అమ్మవారు

పోటెత్తిన భక్తులు

అగనంపూడి: అగనంపూడి పరిసర 8 గ్రామాలకు చెందిన ప్రజల ఇలవేల్పు బొర్రమాంబ అమ్మవారి పుట్ట బంగారు మహోత్సవాన్ని గురువారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి వనం వద్ద వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని బిందెలతో పసుపునీటితో అభిషేకాలు చేశారు. సాయంత్రం పుట్ట బంగారు ఉత్సవం సందర్భంగా వనం నుంచి గ్రామం వరకు అమ్మవారి ఊరేగింపు జరిగింది. దారి పొడవునా మహిళలు పసుపు నీళ్లతో మార్గాన్ని తడిపి, అమ్మవారిని స్వాగతించారు. వనం నుంచి గ్రామం వరకు సుమారు కిలోమీటరు దూరం వేలాది మంది మహిళలు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొన్నారు. రహదారి పొడవునా భక్తులు కిక్కిరిసిపోవడంతో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ పర్యవేక్షణలో ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నేత్రపర్వం.. కుంచుమాంబ అనుపోత్సవం



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు



అమ్మవారి ఊరేగింపులో భారీ సంఖ్యలో పాల్గొన్న భక్తులు

గాజువాక : చినగంట్యాడ గ్రామ దేవత కుంచుమాంబ అనుపోత్సవం గురువారం వైభవంగా జరిగింది. పండగ సందర్భంగా కణితి రోడ్, ఆలయం ప్రాంగణం ధవళకాంతులతో కళకళలాడాయి. గాజువాక పోలీస్ స్టేషన్ సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న అమ్మవారి ఆలయంలో గురువారం తెల్లవారుజాము నుంచే అమ్మవారికి విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గాజువాక, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. యువకుల పులివేషాలు, తప్పెట గుళ్లు, బల్ల వేషాలు, మహిళల కోలాటాలతో అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు

సాధికారతపై విద్యార్థినులకు అవగాహన

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ బాలిక సాధికారిత మిషన్–2024లో భాగంగా దీపాంజలినగర్ సంయుక్త ఫంక్షన్ హాల్లో బేస్‌లైన్ సర్వే నిర్వహించారు. మండలంలోని 28 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు సాధికారత, పరివర్తనాత్మక విద్యా అనుభవాలకు వేదికగా ఈ వర్క్ షాపు నిలిచింది. బేస్‌లైన్ సర్వేలో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వచ్చే నాలుగు వారాలు నిర్వహించనున్న రెసిడెన్షియల్ వర్క్‌షాపులో విద్యారంగం, అవసరాలను అర్థం చేసుకోవడంలో మొదటి దశ పూర్తవుతుంది. హెచ్‌ఆర్ మేనేజర్ ప్రకాశరావు, సీఎస్సార్ ఎగ్జిక్యూటివ్ శివం ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ఉండమ్మా.. బొట్టు పెడతా..

మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు పల్లా చినతల్లి



మహిళకు బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థిస్తున్న పల్లా చినతల్లి

గాజువాక : డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి 67వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని గురువారం వినూత్నంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి ఓట్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని, సంక్షేమ పథకాలతో పాటు మహిళలకు మరింత మేలు చేయడం కోసం జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు నాయకులు మీరాబాయి, అన్నపూర్ణ, లక్ష్మి, సూర్యపావని, రమణమ్మ, పుష్ప, అచ్చంనాయుడు, పల్లా పెంటారావు, భోగి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.